ఫార్ములా ఈ-రేస్ జరిగినప్పుడు తరలివచ్చిన క్రీడా,సినీ,రాజకీయ ప్రముఖులు

ఫార్ములా ఈ-రేస్‌ను చూడటానికి వస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

విజేత జీన్ ఎరిక్‌కు బహుమతిని అందజేస్తున్న అప్పటి కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్

ముంబైలో ఫార్ములా-ఈ రేసు ప్రచారంలో అప్పటి మహారాష్ట్ర సీఎం షిండే, కేంద్రమంత్రి గడ్కరీతో కేటీఆర్

మాజీ క్రికెటర్ సచిన్, ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రాతో సినీనటుడు రామ్‌చరణ్

రేసును తిలకిస్తున్న మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, సినీనటులు నాగార్జున, నాగచైతన్య, దుల్కర్ సల్మాన్, సిద్ధు, యశ్, అఖిల్

టార్గెట్.. కేటీఆర్!

- మొదట్నుంచీ కాంగ్రెస్ వేధింపులు
- వ్యక్తిగతంగా దూషిస్తున్న మంత్రులు
- అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం
- ట్యాపింగ్, ఎన్ కన్వెన్షన్, జన్వాడ, లగచర్లపై వరుసగా ఆరోపణలు
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీరాగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతున్నదని రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తున్నది. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపిన ప్రతిసారీ, ప్రజల్లో సర్కార్‌పై అసమ్మతి పెరిగిన సందర్భాల్లో కేటీఆర్‌ను టార్గెట్‌గా చేసుకొని ఏదో ఒక అంశాన్ని తెరమీదికి తెస్తున్నారని, వ్యక్తిగతంగానూ లక్ష్యంగా చేసుకొని మంత్రులు విమర్శలు చేస్తున్నారని, సంబంధం లేని అంశాల్లో కేటీఆర్ ప్రమేయం ఉన్నదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, సోషల్ మీడియాలోనూ తీవ్ర స్థాయిలో తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు చేస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నాయి.

ఫోన్ ట్యాపింగ్‌తో మొదలు

కాంగ్రెస్ రాగానే 'ఫోన్ ట్యాపింగ్' అంశాన్ని తెరపైకి తెచ్చింది. కేటీఆర్, కేసీఆర్ ఆదేశాల మేరకే ట్యాపింగ్ జరిగిందంటూ ప్రచారం చేసింది. పలువురు పోలీస్ అధికారులపై కేసులు నమోదు చేసి విచారణ జరిపించింది. అదే సమయంలో కేటీఆర్ ఆదేశాలతో ఫలానా వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసినట్టు పోలీసులు ఒప్పుకొన్నారంటూ మీడియా, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసింది.

హోదా మరిచి.. కొండా వ్యాఖ్యలు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా.. నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చేసింది. నిర్మాణం అక్రమమని ప్రభు త్వం, సక్రమమేనని నాగార్జున కుటుంబం వాదించుకున్నాయి. కానీ.. ఈ అంశంతో సంబంధం లేకున్నా కేటీఆర్‌ను మంత్రి కొండా సురేఖ మధ్యలోకి లాగారు. నాగార్జున కుటుంబ అంతర్గత విషయాలను కేటీఆర్‌కు అంటగడుతూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా వేదికగా ఈ వ్యాఖ్యలను ప్రచారం చేశారు.

కుటుంబ దావత్‌కు.. రేవ్‌పార్టీ ముసుగు

జన్వాడలోని కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో ఈ ఏడాది అక్టోబర్‌లో ఒక ఫంక్షన్ జరిగింది. కుటుంబ సభ్యులు, సన్నిహితులు హాజరయ్యారు. అయితే ప్రభుత్వం దీన్ని రేవ్‌పార్టీగా చిత్రీకరించింది. అర్ధరాత్రి పోలీసులు దాడులు చేశారు. డ్రగ్స్ దొరికాయని, విదేశీ మద్యాన్ని పట్టుకున్నారని, క్యాసినో పరికరాలు ఉన్నాయంటూ ప్రచారం చేశారు. చివరికి అది ఫ్యామిలీ ఫంక్షన్ అని తేలడంతో ప్రభుత్వం తెల్లముఖం వేసింది. విదేశీ మద్యం దొరికిందంటూ తూతూమంత్రంగా కేసు నమోదు చేశారు.

జన్వాడ ఫామ్‌హౌస్

జన్వాడ ఫామ్‌హౌస్‌పై ఎన్నికల ముందు నుంచీ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తూనే ఉన్నది. ఫామ్‌హౌస్ తనది కాదంటూ కేటీఆర్ వివరణ ఇచ్చి నా వినలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా దుష్ప్రచారం కొనసాగించింది. ఈ ఏడాది ఆగస్టులో ఇరిగేషన్ అధికారులు ఫామ్‌హౌస్ వద్ద కొలతలు వేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదంటూ హడావుడి చేశా రు. 'కేటీఆర్‌కు చెందిన ఫాం హౌస్‌లో కూల్చివేతలు' అంటూ మీడియా సైతం హడావుడి చేసింది.

లగచర్ల ఘటనలోనూ

కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులు ఫార్మాసిటీకి భూసేకరణను అడ్డుకొని, అధికారులపై దాడిచేసిన ఘటనలోనూ కేటీఆర్‌ను ఇరికించేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ ఘటన వెనుక కేటీఆర్ ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకే జరిగిందంటూ విష ప్రచారం చేసింది. చివరికి పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసింది.

సోషల్ మీడియాలోనూ..

కాంగ్రెస్ తమ అనుకూల మీడియాలో, సోషల్ మీడియాలో కేటీఆర్‌పై తీవ్ర దుష్ప్రచారం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు చెప్తున్నారు. పార్టీ కార్యక్రమం కోసమో, ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకో ఢిల్లీకి వెళ్లినా 'కేసుల నుంచి తప్పించుకునేందుకు బీజేపీ పెద్దలను కలుస్తున్నారు' అంటూ ప్రచారం చేశారని, రాజ్‌పాకాల ఇంట్లో ఫంక్షన్ విషయంలోనూ అర్ధరాత్రి దాటిన తర్వాత కేటీఆర్ అక్కడికి వెళ్లారని, ఆయన భార్య పార్టీలో పాల్గొన్నారని అనుచిత ప్రచారం చేశారని మండిపడుతున్నారు. తాజాగా ఫార్ములా ఈ రేస్ కూడా ఆకోవలోకే వస్తుందని అంటున్నారు. కేటీఆర్ ఎక్కడా దొరక్కపోవడంతోనే ప్రభుత్వ పెద్దలు ఫ్రస్టేషన్‌లో ఉన్నారని, ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకు.. హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకు కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలన్న కక్షపూరిత ధోరణితో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏసీబీతో కేసులు నమోదు చేయించిందని విమర్శిస్తున్నారు.

..కేటీఆర్‌పై కేసు

I తరువాయి...

రాశారు. దీంతో బుధవారం సాయంత్రం ఎంఏయూడీ సెక్రటరీ దాన కిశోర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ తెలిపారు. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తూ, ప్రభుత్వ అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా రూ.54,88,87,043 కోట్లను యూకేకు చెందిన 'ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్' (ఎఫ్ఈఓ) కంపెనీకి హిమాయత్‌నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి బదిలీ చేయించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఇతరులపై కేసు నమోదు చేశారు. ఐసీపీ (బీఎన్ఎస్) 13(1)(ఏ), 13(2), సీపీయాక్ట్ 409, 120 (బీ) సెక్షన్స్ కింద అభియోగాలు మోపారు. ఈ మేరకు నాంపల్లి ఏసీబీ కోర్టుకు ఏసీబీ అధికారులు వివరణ ఇచ్చారు. రూ.10 కోట్లకు మించి బదిలీ జరిగితే ప్రభుత్వం, ఆర్థికశాఖ అనుమతి అవసరమని, సీజన్ 10 ఫార్ములా ఈ రేసింగ్‌కు స్పాన్సర్స్ లేక పోవడంతో హెచ్ఎండీఏ నిధులు మళ్లించారని, దీంతో విదేశీ కంపెనీకి చెల్లింపులతో హెచ్ఎండీఏకు అదనపు పన్ను భారమైందని దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

విచారణకు ప్రత్యేక బృందం

కేటీఆర్ సహా ఇతర అధికారులను విచారించేందుకు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ బంజారాహిల్స్‌లోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా బృందాన్ని విచారణ కోసం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఈ టీమ్‌లో పది మంది సిబ్బంది ఉన్నట్టు సమాచారం. విచారణ వివరాలు ఎప్పటికప్పుడు ఏసీబీ ఉన్నతాధికారికి, వారి నుంచి ప్రభుత్వానికి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో కేటీఆర్‌కు త్వరలోనే విచారణ నోటీసులను ఏసీబీ అధికారులు ఇవ్వనున్నారు. ఇప్పటికే కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్ర ప్రజలకు ఈ-కార్ రేస్ గురించి వాస్తవాలు వెల్లడించడంతో ఆయనను అక్రమంగానైనా అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే పలు అక్రమ అరెస్టులతో ప్రభుత్వానికి చెడ్డపేరు రావడంతో కేటీఆర్ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ ముగిసిన వెంటనే నోటీసులు అందజేస్తారని సమాచారం.

ఏసీబీ కేసుపై హైకోర్టుకు కేటీఆర్?

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుపై మాజీ మంత్రి కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు న్యాయ నిపుణులతో కేటీఆర్ ఇప్పటికే చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఫార్ములా-ఈ రేసుకు సంబంధించి ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసే యోచనలో కేటీఆర్ ఉన్నట్టు తెలిసింది.

అదానీపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

రాహుల్‌గాంధీకి రాసిన లేఖలో కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): అదానీ విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని అనుసరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. జాతీయ స్థాయిలో అదానీ పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు కేటీఆర్ లేఖ రాశారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న అదానీ వ్యతిరేక నిరసనలను రాజకీయ డ్రామాగా అభివర్ణించారు. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రజలు క్షమించరని అన్నారు.

ఇదో తుపైల్ కేసు

- ప్రపంచంలో ఇంత వరస్ట్ కేసు ఇంకోటి ఉండదు
- ఇలాంటి ప్రాసీజర్ ఉల్లంఘనలు ప్రతి శాఖలో ఉంటయ్
- ఖజానాకు నష్టం జరిగిందంటే రేవంత్ నిర్ణయం వల్లే
- ఫార్ములా ఈ-కేసులో ఏ1 ముమ్మాటికీ రేవంత్‌రెడ్డే
- ఆయనను జైలుకు పంపిస్తేనే రాష్ట్రం మళ్లీ పరుగులు
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపాటు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ఫార్ములా ఈ-కార్ రేస్‌లో కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదుపై ఐపీఎస్ మాజీ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పందించారు. ఐపీఎస్ మాజీ అధికారిగా ఈ కేసుపై తన ఎక్స్ ఖాతాలో ఆయన కొన్ని ముఖ్యమైన వాఖ్యలు చేశారు. 'నేను రెండేండ్లు హైదరాబాద్ క్రైమ్ బ్రాంచ్ డీసీపీగా ఎన్నో ఆర్థిక నేరాలను పరిశోధించాను. అదే అనుభవంతో కేటీఆర్ మీద ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ 14/2024 లోని అన్ని వివరాలను లోతుగా పరిశీలించాను. ప్రపంచంలో ఇంత తుపైల్ (వరెస్ట్) కేసు ఇంకొకటి ఉండదు. గమ్మత్తేం దంటే ప్రస్తుత పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో ఇప్పించిన ఫిర్యాదులో ఎక్కడా సదరు రూ.55 కోట్ల నుంచి ఒక్క పైసా కూడా కేటీఆర్ జేబుల్లోకి వెళ్లినట్టు నిరూపించలేక పోయారు. పాపం ఆరు నెలలు శ్రమించారు కదా ! ప్రజలు మీకిచ్చిన విలువైన సమయాన్ని నీటిపాలు చేశారు. ఆ మాటకొస్తే అరవింద్ కుమార్ ఐఏఎస్, చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి మీద కూడా అవినీతి జరిగినట్టు ఈ ఫిర్యాదులో నిరూపించలేకపోయారు. మీరు చూపించగలిగిందంతా ప్రొసీజర్ ఉల్లంఘనలు మాత్రమే! వీటికి శాఖా పరమైన ఎంక్వైరీ వేసి నిజమేందో తెలుసుకుంటే సరిపోయేది. అది ఇప్పటికే జరిగింది. సచివాలయంలో ఇలాంటి ప్రొసీజర్ ఉల్లంఘనలు ప్రతి డిపార్ట్‌మెంట్‌లో రోజూ జరుగుతుంటయి. అట్ల చేయకపోతే అనుకున్న లక్ష్యం నెరవేరదు. ప్రజలు ఇబ్బంది పడుతరు. వీటిని తర్వాత క్యాబినెట్‌లో పెట్టి క్రమబద్ధీకరిస్తరు. వీటి మీద స్పష్టత లేని వాళ్లకు ప్రతిదీ వయలేషన్ లాగానే కనిపిస్తది. ఇందులో రూ.55 కోట్లు ఖర్చు పెట్టింది కూడా రాష్ట్రానికి వందల కోట్ల రాబడి రావడం కోసమే.. మీకేమైనా అనుమానాలుంటే అన్నీ అసెంబ్లీ సాక్షిగా నివృత్తి చేస్తామని కేటీఆర్ అంటున్నా ముఖం చాటేసి పిరికిపందల్లా ఏసీబీకి ఫైలు అప్పగించారు. అసలు ఈ విషయంలో ప్రభుత్వ ఖజానాకు ఏమైనా నష్టం జరిగిందంటే అది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్లనే. ఎవరినడిగి మీరు ఫార్ములా-ఈ అగ్రిమెంట్‌ను రద్దుచేశారు? మీరు ముందు నిపుణుల కమిటీతో చర్చించారా? దీనిపై క్యాబినెట్ అనుమతి తీసుకున్నారా? మీ వల్లే తెలంగాణకు వచ్చే వందల కోట్ల రాబడి ఆగిపోయింది. మన నగరానికొచ్చే ఫార్ములా ఈ రేసింగ్‌ను పక్క రాష్ట్రం కర్ణాటక తన్నుకు పోయింది. అసలు ఈ ఫార్ములా ఈ-కేసులో ఏ1 కేటీఆర్ కాదు.. ముమ్మాటికీ రేవంత్‌రెడ్డే! అసలు నేడు తెలంగాణ ఖజానా ఖాళీగా ఉండటానికి కారణం రేవంత్‌రెడ్డి. ఆయనను మళ్లీ జైలుకు పంపిస్తేనే తెలంగాణ మళ్లీ పరుగులు పెడ్తది. ఇదే నిప్పులాంటి నిజం. దాచేస్తే దాగని సత్యం' అని ఆర్ఎస్పీ స్పష్టంచేశారు.

మేలెంచిన కేటీఆర్.. కీడెంచిన కాంగ్రెస్

- కష్టపడి ఈ రేస్‌ను తెచ్చిన కేటీఆర్
- తెలంగాణకు 700 కోట్ల మేర లబ్ధి
- ఇదే స్ఫూర్తితో వేరే రాష్ట్రాల్లోనూ రేస్
- కక్షతో రేస్‌ను రద్దు చేసిన కాంగ్రెస్
- పరువుతోపాటు ఆర్థికంగానూ రాష్ట్రానికి తీవ్ర నష్టం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా చెప్పుకోవడానికి ఏమీ లేకపోవడం.. ప్రభుత్వ ప్రభ క్రమంగా మసకబారుతుండటం.. అసెంబ్లీ వేదికగా ఇరుకున పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ఫార్ములా-ఈ రేస్‌ను తెరమీదికి తెచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. దీంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేటీఆర్ ఆధ్వర్యంలో ఫార్ములా-ఈ రేస్‌ను నిర్వహించి తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచి, హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరాల సరసన నిలిపితే.. రేవంత్ ప్రభుత్వం కక్షతో రేస్‌ను రద్దు చేసి హైదరాబాద్ పరువు తీసిందని విమర్శలు వస్తున్నాయి. ఒకరు తెలంగాణ మేలెంచితే.. మరొకరు కీడెంచారంటూ విశ్లేషకులు మండిపడుతున్నారు.

ఏమిటీ ఈ-రేస్?

పర్యావరణాన్ని కాపాడాలన్న లక్ష్యంతో మోటారు వాహనాలు వెదజల్లే కర్బన ఉద్గారాలను తగ్గించడం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో ఫార్ములా ఈ-రేస్ నిర్వహిస్తుంటారు. ఎలక్ట్రిక్ కార్లు కూడా వందల కిలోమీటర్ల వేగంతో పరుగులు తీయగలవని నిరూపించడమే ఫార్ములా-ఈ రేస్ లక్ష్యం! అంతర్జాతీయ సంస్థ 'ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్ (ఎఫ్ఐఏ)' ఈ రేసులను నిర్వహిస్తుంటుంది.

అట్టహాసంగా నిర్వహణ

2023 ఫిబ్రవరి 5 నుంచి 11 వరకు ఈ-రేస్ 9వ సీజన్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమిచ్చింది. హుస్సేన్‌సాగర్ ఒడ్డున అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. మొత్తం 11 జట్లు పాల్గొన్నాయి. ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉండే 22 బ్రాండ్ల ఎలక్ట్రిక్ కార్లు పాల్గొన్నాయి. రేస్‌ను చూసేందుకు 35 వేల మంది వచ్చారు. 150 దేశాల్లోని కార్ల ప్రేమికులు ప్రత్యక్ష ప్రసారాలు, వివిధ మాధ్యమాల ద్వారా వీక్షించారు. ఎలక్ట్రిక్ కార్లు గంటకు 322 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోగలవని ఈ-రేస్ నిరూపించింది.

వచ్చిన లాభం ఏమిటి?

ఫార్ములా ఈ-రేస్‌తో రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు కలిగాయి. టోక్యో, షాంఘై, బెర్లిన్ , మొనాకో, లండన్ వంటి నగరాల సరసన హైదరాబాద్ చేరింది. టాప్ -25 నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచినట్టు అనేక సంస్థలు ప్రకటించాయి. ఈ-రేస్ తర్వాత నీల్సన్ స్పోర్ట్స్ అనాలసిస్ సంస్థ 'తెలంగాణకు సుమారు రూ.700 కోట్ల మేర ఆర్థిక లబ్ధి చేకూరింది' అని స్పష్టంచేసింది. ఆతిథ్య నగరంగా హైదరాబాద్ పరపతి పెరిగిందని తెలిపింది.

సమస్య ఏమిటి?

తొలి రేస్‌కు గ్రీన్‌కో సహా పలు సంస్థలు స్పాన్సర్ షిప్ ఇచ్చాయి. 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన రేస్ విషయంలో స్పాన్సర్ల సమస్య వచ్చింది. తాము నిర్వహించలేమని ఎఫ్ఐఏ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి గతేడాది జూన్-జూలై మధ్య తెల్పిచెప్పారు. దీంతో నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కొత్త ప్రతిపాదన తెచ్చారు. 2024 ఫిబ్రవరి నాటికి తాము స్పాన్సర్లను తీసుకొస్తామని, అప్పటివరకు రేస్ నిర్వహణ కోసం హెచ్ఎండీఏ నుంచి దాదాపు రూ.55 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. ఈ మేరకు పురపాలక శాఖ మంత్రి హోదాలో ఆదేశాలు జారీ చేయగా, శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్ నిధులు విడుదల చేశారు. హెచ్ఎండీఏ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించి, ఈ నిధులను నిర్వహణ సంస్థ ఖాతాకు పంపింది.

ప్రభుత్వ భాగస్వామ్యంతో కొత్తేమీ కాదు

రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్పోర్ట్స్ ఈవెంట్లు జరగడం కొత్తేమీ కాదు. తమిళనాడు ప్రభుత్వం 'ఫార్ములా-4 నైట్ స్ట్రీట్ రేసింగ్' నిర్వహించింది. రూ.30 కోట్లు ఖర్చు చేసింది. నొయిడాలో మోటో జీపీ రేసుకు యూపీ ప్రభుత్వం రూ.80 కోట్లు చెల్లించింది. ఒడిశా రూ.260 కోట్లు ఖర్చు చేసి 2023 హాకీ ప్రపంచ కప్ నిర్వహించింది. మహారాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్ల చొప్పున ఖర్చు చేసి హీరో ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ కప్- 2019, 2023ను ముంబై, భువనేశ్వర్‌లో, రూ.100 కోట్ల చొప్పున ఖర్చు చేసి రోడ్ సేఫ్టీ వరల్డ్ సిరీస్-2020, 2022ను ముంబై, రాయ్‌పూర్‌లో నిర్వహించింది. అంతేకాదు.. ఫార్ములా ఈ-రేస్‌ను తమ రాష్ట్రంలో నిర్వహించాలని సాక్షాత్తూ మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ రేసులో భాగంగా గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ కౌంట్ డౌన్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో తాము కూడా పోటీ పడతామని ప్రకటించారు.

రాజకీయ కక్ష.. రేస్ రద్దు వల్లే!

ప్రభుత్వం రాజకీయ కక్షతోనే ఈ కేసు పెట్టినట్టు నిపుణులు చెప్తున్నారు. వాస్తవానికి తాము రేస్ నిర్వహించలేమని రాష్ట్ర ప్రభుత్వానికి ఎఫ్ఐఏ గతేడాది చెప్పే సమయంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నది. అయినా ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ కాబట్టి ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులకు భరోసా కల్పించేందుకు కేటీఆర్ ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ నిధులు విడుదల చేసింది. ఆ నిధులతో ఈ ఏడాది ఫిబ్రవరిలో రేసు నిర్వహిస్తే అసలు ఈ కేసే ఉండేది కాదు. అలాకాకుండా రేసు రద్దు చేయడంతో నిర్వహణ సంస్థ రూ.55 కోట్లను వెనక్కి ఇవ్వలేదు. ఈ డబ్బులో రూపాయి కూడా కేటీఆర్‌కో, బీఆర్ఎస్‌కో వెళ్లలేదు.

ఎలా వచ్చింది?

ఈ రేసులు నగరంలో నిర్వహించి అంతర్జాతీయంగా హైదరాబాద్ బ్రాండ్‌ను పెంచాలని పురపాలక శాఖ మంత్రిగా కేటీఆర్ తపన పడ్డారు. నాటి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్‌తో కలిసి కసరత్తు చేసి, హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, హైదరాబాద్ వరుసగా ఐదుసార్లు మోస్ట్ లివెబుల్ సిటీగా గుర్తింపు పొందడం, వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డ్-2022 గెలుచుకోవడం, హరితహారం ద్వారా 6.5 కోట్ల మొక్కలు నాటడం, తెలంగాణ వ్యాప్తంగా గ్రీన్ కవర్‌ను పెంచడం వంటివి వివరించారు. దీంతో హైదరాబాద్‌లో ఈ-రేస్ నిర్వాహణకు ఎఫ్ఐఏ ఒప్పుకొన్నది.

కాంగ్రెస్ ఏం చేసింది.. ఫలితం ఏమిటి?

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫార్ములా ఈ-రేస్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. 2024 ఫిబ్రవరిలో జరగాల్సిన రేసు ఆగిపోయింది. ఈ ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని నిపుణులు చెప్తున్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ ఈవెంట్లు నిర్వహించాల్సి వస్తే పేరు మోసిన బ్రాండ్లు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందాలకు వెనుకాడుతాయంటున్నారు. అంతర్జాతీయ సంస్థను కోర్టుకు ఈడ్చడం ద్వారా పెట్టుబడిదారుల్లో భయానక వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉన్నదని స్పష్టంచేస్తున్నారు.

CSIR-CENTRAL FOOD TECHNOLOGICAL RESEARCH INSTITUTE
RESOURCE CENTRE, HYDERABAD-500 007
announces
Hands on Training Programme
on
VALUE ADDED PRODUCTS FROM MINOR MILLETS
(Under the sponsorship of Khadi and Village Industries Commission (KVIC), Mumbai)
Applications are invited from interested candidates for Hands on Training Programme on **Value added products from minor millets** to enhance the entrepreneur's skills in processing minor millets. Degree/Diploma holders are eligible to apply. There is no course fee. The training programme will be held at CSIR-CFTRI Resource Centre, Habshiguda, (Opp to Metro pillar C-968) Hyderabad during **20-23 Jan 2025.** Number of participants is limited to 15 only. Selected candidates have to make their own arrangements for travel & accommodation during the programme.
Applications with details of qualifications, age, experience (if any) and contact details, along with entrepreneurship details (if any) may be mailed to **sathiyamala@cftri.res.in** or **rchyderabad@cftri.res.in** on or before 05.01.2025. Shortlisting of candidates will be carried out by a screening committee. The decision of the screening committee is final and binding. Interested Candidates may contact Mrs. K. Sathiya Mala: 9246356615; Mr. A. Nagender: 9440544676

కుట్రలు, కేసులతో డైవర్షన్ పాలిటిక్స్

పరిగిలో ముఖ్యమంత్రి రేవంత్ దిష్టిబొమ్మ దహనం

పరిగి, డిసెంబర్ 19: ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదు చేయడం పట్ల బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సర్కారు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. వికారాబాద్ జిల్లా పరిగి మండల కేంద్రంలో గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదని విమర్శించారు. కుట్రలు, కేసులతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడడం అవివేకమని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడం వల్లే కేటీఆర్‌పై ఫార్ములా ఈ-కారు రేస్ కేసు నమోదు చేసినట్టు ఆరోపించారు. వెంటనే కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ కరణం అరవిందరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.